# తనదాకా వస్తే...

శ్రీశ్రీశ్రీ చేతనానందస్వామి వారి చైతన్యాశ్రమం బ్రహ్మ ముహూర్తంలోనే మేల్కొంది. ఆశ్రమవాసుల దినచర్య సందడి పక్షుల కిలకిలారావాలకు స్వాగతం పలికింది. వేదపాఠశాలలో పాఠాలు వల్లెవేస్తున్న సంస్కృత విద్యార్థుల గొంతులు ప్రకృతికి సుప్రభాతం పాడుతున్నాయి. బాలభాస్కరుని నునులేత కిరణాలు తులసివనానికి బంగారు పూతలు పూస్తున్నాయి. మానవుని లోలాగా మాలో గూడా పరమాత్మ వుందని తలలూపుతున్నారు తరుతరుణులు. పాదులకు నీరుపెడుతున్న ప్రొఫెసర్ శ్రీకాంత్ కాస్త నీరసంగానే నేలమీద కూర్చున్నాడు. దైవలీలకు పరాకాష్టలైన పంచభూతాలు పరచిన అందాలను చూస్తుంటే అలసట కాస్తా కరిగిపోయింది. కొత్త అనుభూతి కలిగింది. అంతలోనే శైలబాల మదిలో మెదిలింది గుండెలో గునపం దిగబడింది. స్వయంకృతం కరచినగాయం మానినా మాయని మచ్చ మాత్రం వెక్కిరిస్తూనే వుంది. ఆ మెలావణ్యం, అమాయకత్వం అన్నింటినీ మించిన చలాకీతనం జ్ఞాపకాల పొరల్లో ఆరనిచిచ్చు రగిల్చాయి.

"దైవం, ధర్మం అనేవి మిథ్యావాదాలు. సాంప్రదాయం, ఆచారం అనేవి మానవుని స్వేచ్ఛకు అప్రత్యక్ష బంధనాలు. ప్రత్యక్షభౌతిక సుఖాలకు అడ్డుగోడలు. భారతీయ వివాహవ్యవస్థ

ఒక బొమ్మలాట. దానివల్ల ఖర్చేతప్ప ప్రయోజనం శూన్యం. యువతీయువకులు ఆధునిక నాగరత నలవరచుకుని స్వేచ్ఛా విహంగాలై విహరిస్తే మనదేశం గూడా ముందంజ వేస్తుందనడం లో అనుమానంలేదు." తాను విదేశాలనుండి రాగానే యూని వర్సిటీలో మొట్ట మొదటి పాఠం. తన లెక్చర్ను శైలబాల సావ ధానంగా వింటూంటే అదోలా అన్పించింది. అప్పటి నుండి శైలబాలలో సరికొత్త భావాలు చిగురించాయి. వెంటనే అమ్మా నాన్నలు మమ్మీడాడీలయ్యారు. నెలరోజుల తర్వాత.

సంధ్యా వందనానికి కూచోబోయే ముందు..........

"ఏమండీ! ఈడొచ్చిన పిల్లను ఎన్నాళ్ళని ఇంట్లో అట్టి పెట్టుకుంటాము?........ మంచి సంబంధమొహటి చూడండీ!" అంది అర్ధాంగి శమంతకం పూజసామాన్లు సర్దుతూ.

"ఏవిటోయ్! ఈరోజు కొత్తగా మాట్లాడుతున్నావు! ఏమిటీ విశేషం?'' అన్నాడు మడి పంచెను కట్టుకుంటూ. "ఈడొచ్చిన పిల్లగదండీ..." మళ్ళీనసిగింది. తడిచేతుల్ని కొంగుకు తుడుచు కుంటూ. "చాల్చాలు, నీదంతా చాదస్తం శమంతకం. శైలబా లంటే ఏమనుకున్నావ్?" అన్నాడు "శైలబాలంటె మీ ముద్దులపట్టి, మన ఏకైక సంతానం, మీ యూనివర్సిటీలోనే యమ్మే స్టూడెంటు." "మరైతే భయమెందుకు? నేను రష్యాకెళ్ళినప్పు డేదైనా జరిగిందా?'' అనుమానం వ్యక్తం చేశాడు పూజమీద కూచుంటూ. ''అదేంలేదు మీరు విదేశాలకెళ్ళొస్తే మీలో మార్పు కనిపించడం లేదు గాని కూతురులోనే కనబడుతూంది. రోజూ రాత్రియ్యేదాకా కొంపకు చేరడంలేదు....సాగదీసింది.

"అందులో కొంపలంటుకుపోయేదేముంది? ఆ మాత్రము స్వేచ్ఛనివ్వకపోతే పిల్లలు కూపస్థ మంతూకాలౌతారు. అదే విదేశాల్లోనైతేనా...?" అంటుంటే "ఆపండాపండి ఆడపిల్లకు స్వేచ్ఛ ఉండ వద్దని నేననండంలేదు. కాని పాశ్చాత్య దేశాల్లోలాగా మించిన స్వేచ్ఛనిస్తే అధోగతే!" అంటూ తన పనుల్లోకి వెళ్ళి ఆవధులు పోయింది. మనసులో గతుక్కుమన్నా మనిషి సంధ్యా వందనంలో లీనమయ్యాడు. తన లెక్చర్స్ నెందరో ప్రశంసించడం, విద్యార్థులు తనను అభ్యుదయవాదిగా పొగడడం లాంటివి నోరును నొక్కేసాయి. * * * * * *

"ఏమ్మా! ఈరోజు క్లాసుకు రాలేదేంటి? యూనివర్సిటీ నుండి రాగానే కూతురునడిగాడు. తలెత్తి చూచి దించుకుంది. సమాధానం రాలేదు. డ్రెస్ మార్చుకుంటూ భార్యనడిగాడు. సంగతేమిటని. భార్య ముఖం జేవురించింది. కళ్ళ నిండా నీళ్ళు. "కొంపమునిగిందండీ?" భోరుమంది శోకమూర్తిలా కనిపించింది. కొంగులో మొహం దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తుంటే "ఏమైంది శమతకం" అనడిగాడు అనునయంగా. ఏడుపే సమాధానమైంది. చిరాకేసింది. "పిచ్చిమొహమా! సంగతేమిటో చెప్పవేం?" ఉబ్బిన కళ్ళను తుడుచుకుంటూ. "ఈరోజమ్మాయి తొమ్మిది గంటలకు నిద్రలేచింది. మొహం కడుక్కుంటూ బాత్రూంలో పడిపోయింది. పనిమనిషి సాయంతో లేవనెత్తి డాక్టర్‌కుఫోన్ చేశాను. డాక్టర్ సీతగారొచ్చి చూసారు." అంది. 'మరింక దిగులెందుకు?' అన్నాడు. "పోయేప్పుడు పిడుగులాంటి వార్త చెప్పింది." ఖంగుతినడం తనవంతైంది. కోపం కట్టలు తెంచుకుంటూంది. "ఏమ్మా! నిజమేనా?" గద్దించాడు కూతుర్ని,